# 103. అల్ అస్ర్ (కాలం) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 3 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా సన్మార్గం గురించి బోధించింది. మొదటి ఆయతులో వచ్చిన 'అస్ర్' (కాలం) అన్న పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. అల్లాహ్‌ను విశ్వసించిన వారు, మంచిపనులు చేసిన వారు, పరస్పరం హితబోధ చేసుకున్న వారు తప్ప మిగిలిన వారందరూ తీర్పుదినాన నష్టానికి గురవుతారని ఈ సూరా తెలియజేసింది. ఈ సూరా సన్మార్గానికి సంబంధించిన ప్రధానమైన సూత్రాలను ప్రతిపాదించింది. అవి: అల్లాహ్‌ను విశ్వసించడం, మంచిపనులు చేయడం, సత్యం, సహనాల విషయమై ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం.

# 103. అల్ అస్ర్ సూరా

سُوْرَةُ الْعَصْرِ

అవతరణ :మక్కా ఆయతులు :3

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** కాలం సాక్షిగా![1]

وَالْعَصْرِ ۝١

**2** నిశ్చయంగా మానవుడు నష్టంలో పడి ఉన్నాడు.[2]

اِنَّ الْاِنْسَانَ لَفِيْ خُسْرٍ ۝٢

**3** అయితే విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారు,[3] పరస్పరం సత్యం గురించి ఉపదే

اِلَّا الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ وَتَوَاصَوْا بِالْحَقِّ ۙ

1. **'కాలం'** ( اَلْعَصْر ) అంటే రేయింబవళ్ళ చక్రభ్రమణం. రాత్రి వచ్చినప్పుడు చీకటి అలుముకుంటుంది. పగలు వచ్చినప్పుడు సర్వం వెలుగుమయం అవుతుంది. అదీగాక ఈ రేయింబవళ్లు తరుగుతూ పెరుగుతూ ఉంటాయి. పగలు సుదీర్ఘంగా ఉన్నప్పుడు రాత్రి చిన్నదిగా ఉంటుంది. రాత్రి పెద్దదిగా ఉన్నప్పుడు పగలు చిన్నదిగా ఉంటుంది. రేయింబవళ్లలోని ఈ ఎగుళ్లు దిగుళ్ల మిశ్రమమే 'కాలం'. ఇది దేవుని అపార శక్తికి, అసాధారణ కార్యదక్షతకి ఒక దర్పణం. అందుకే పరమ ప్రభువు 'కాలం'పై ప్రమాణం చేశాడు. ఇంతకుముందు కూడా చెప్పినట్లు దేవుడు తన సృష్టితాలలో తాను తలచిన దానిపై ప్రమాణం చేయగలడు. కాని మానవులు మాత్రం దేవునిపై తప్ప మరే వస్తువుపై కూడా ప్రమాణం చేయకూడదు.

2. మనిషి కష్టనష్టాలు సుస్పష్టమే. అతడు బ్రతికున్నంత కాలం అహోరాత్రులు నిరంతరం పరిశ్రమిస్తూ ఉంటాడు. తుదకు అతనికి మరణం వస్తుంది. అయితే మరణించిన పిదప అయినా అతనికి విశ్రాంతి, సుఖం ప్రాప్తిస్తుందా అంటే అదీ లేదు. పైగా అతను నరకానికి ఆహుతి అవుతున్నాడు.

3. అయితే **'విశ్వాసం'** (ఈమాన్) అనే భాగ్యాన్ని పొంది, ఆపైన మంచిపనులు చేస్తూ జీవితం గడిపినవారు మాత్రం ఈ నష్టం నుండి సురక్షితంగా ఉండగలుగుతారు. మరణానంతరం వారు శాశ్వితమైన దైవానుగ్రహాలను, స్వర్గలోక భాగ్యాలను ఆస్వాదిస్తారు. తరువాతి వాక్యంలో విశ్వాసులలోని మరో రెండు సుగుణాలు ప్రస్తావించబడ్డాయి.

| | |
|---|---|
| శించినవారు,[4] ఒండొకరికి సహనం (స్థయిర్యం) గురించి తాకీదు చేసినవారు[5] మాత్రం నష్టపోరు. | وَتَوَاصَوۡا بِالصَّبۡرِ ۝٣ |

4. అంటే దైవధర్మాన్ని, దైవాజ్ఞలను గురించి ప్రబోధిస్తూ, దేవుడు నిషేధించిన విషయాలకు, పాపకార్యాలకు దూరంగా ఉండాలని ఉపదేశించేవారు...

5. ఇంతకీ సహనం (ఓర్పు, నిగ్రహం) దేనిపై? అంటే – కష్టాలపై ! దైవశాసనాల ప్రకారం జీవితం గడిపే సమయంలో ఎదురయ్యే పరీక్షలపై!

పాపకార్యాలు, నీతిబాహ్యమైన విషయాలు ఎదురుపడినప్పుడు! మనోవాంఛలను త్యాగం చేయవలసి వచ్చినప్పుడు!

ఇలాంటి పరిస్థితుల్లో మనిషి ఓపిక పట్టి, సత్యధర్మంపై స్థిరత్వం కనబరచాలి. ఇది నిజంగా సాహసోపేతమైన విషయమే. 'సహనం' కూడా 'సత్యం'లో ఇమిడి ఉన్న విషయమే అయినప్పటికీ ఈ సూరాలో దీన్ని ప్రత్యేకంగా విడదీసి చెప్పటం జరిగింది. దీన్నిబట్టి ధర్మావలంబనలో 'సహనానికి' గల ప్రాముఖ్యత ఎంతటిదో అవగతం అవుతోంది.